క్లుప్తంగా

కార్మికుల పని గంటలు పెంచడం సరికాదు

గంగవరం : కార్మికుల పని గంటలు పెంచడం చాలా బాధాకరమని , కార్మికులకు పనిభారం పెంపుపై వైఎస్సార్‌సీపీ మండల కమిటీ అధ్యక్షుడు యెజ్జు వెంకటేశ్వరరావు తీవ్రంగా ఖండించారు. శనివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వం కార్మికుల పని గంటలు పెంచడం వల్ల కార్మికులు తీవ్ర ఒత్తిడికి గురువుతారన్నారు.

ఇంటర్‌లో ప్రవేశానికి రెండో విడత కౌన్సెలింగ్

రంపచోడవరం: గురుకుల పాఠశాలల్లో ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి రెండో కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నట్టు గిరిజన సంక్షేమశాఖ డీడీ ఎం రుక్మాంగధయ్య తెలిపారు. రంపచోడవరం, చింతూరు పరిధిలోని ఎనిమిది గురుకుల కళాశాలల్లో ఇంటర్ మొదటి సంవత్సరంలో 204 సీట్లుకు బాలురు -147, బాలికలు -57 సీట్లు భర్తీకి ఈ నెల 17న కౌన్సిలింగ్ జరుగుతుందన్నారు. రంపచోడవరంలోని బాలికల గురుకుల కళాశాలలో బాలికలకు, డిగ్రీ కళాశాల వద్ద ఉన్న బాలుర కళాశాల వద్ద బాలురకు కౌన్సింగ్ జరుగుతుందన్నారు. పదో తరగతిలో వచ్చిన మార్కులు ఆధారంగా సీట్లు కేటాయించడం జరుగుతుందన్నారు. విద్యార్థులు పదో తరగతి టీసీ, స్టడీ సర్టిఫికెట్, ఆన్‌లైన్ మార్కులిస్టు, కులధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డు జిరాక్స్, తల్లిదండ్రుల ఆధార్ కార్డులు జిరాక్స్ ,బ్యాంకు వివరాలు , విద్యార్థి ఐదు పాస్‌పోర్టు ఫోటోలు వెంట తీసుకురావాలన్నారు. మరిన్ని వివరాలకు రంపచోడవరంలోని గురుకుల కళాశాల ప్రిన్సిపాల్స్‌ను సంప్రదించాలన్నారు.

భక్తిశ్రద్ధలతో నగర సంకీర్తన


నగర సంకీర్తనలో పాల్గొన్న భక్తులు

మాకవరపాలెం: వేంకటేశ్వరస్వామి నగర సంకీర్తన వైభవంగా నిర్వహించారు. మండలంలోని తామరంలోని వేంకటేశ్వరస్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శనివారం స్థానిక బస్టాండు నుంచి తామరం ఆలయం వరకు భక్తులు నగర సంకీర్తన చేశారు. శ్రీవారి చిత్రపటాలతో భక్తి గీతాలు ఆలపిస్తూ ఆలయానికి చేరుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు ప్రభాకరరాజు, రఘుబాబు, నారాయణరావు పాల్గొన్నారు.

19న మరిడిమాంబ జాతర

మాడుగుల : ఈ నెల 19వ తేదీన మరిడిమాంబ జాతర జరగనుందని, ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా ఈ నెల 15న చాటింపు 17 వ తేదీన అమ్మవారి కొలువు, 19న పండగ జరగనుందన్నారు. భక్తులు పెద్ద ఎత్తున ఉత్సవంలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

ఏరియా ఆస్పత్రిలో రక్తదాన శిబిరం


శిబిరంలో రక్తదానం చేస్తున్న దాతలు

నర్సీపట్నం : ప్రపంచ రక్తదాన దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం ఏరియా హాస్పిటల్ బ్లడ్ బ్యాంక్‌లో సమిద స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో 22 మంది రక్తదానం చేశారు. ఈ సందర్భంగా హాస్పిటల్ సూపరింటెంటెంట్ ఎస్.వి.ఎస్.సుధా శారద మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు జరిగినపుడు, గర్భిణులు కాన్పు సమయంలో ఆపరేషన్ అవసరమైనప్పుడు రక్తం చాలా అవసరమన్నారు. దాతలు ముందుకువచ్చి రక్తదానం చేయడం ద్వారా ప్రభుత్వ ఆస్పత్రికి బ్లడ్ కోసం వచ్చే రోగులకు రక్తం కొరత ఉండదన్నారు. అనంతరం రక్తదాన అవశ్యకతపై ఏరియా ఆస్పత్రి నుంచి అబిద్ సెంటర్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు.

ధ్యాన వేంకటేశ్వరస్వామికి ప్రత్యేకాలంకరణ



కశింకోట: స్థానిక ధ్యాన వేంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామివారు వివిధ అలంకరణలతో దేదీప్యమానంగా భక్తులకు దర్శనమిచ్చారు. శనివారం స్వామివారిని వజ్ర కవచాలంకృతులతో పాటు వివిధ రకాల పూలమాలలు, తులసీమాలలతో అలంకరించారు. విష్ణు సహస్ర నామార్చన చేశారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. నక్షత్ర హారతి ఇచ్చారు. ఆలయ అర్చకుడు రేజేటి రామచరణాచార్యులు ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు.

అంతర పంటల సాగు.. లాభాలు బాగు


పెదబయలు గ్రామ పంచాయతీలో వేరుశెనగ సాగు

వేరుశనగలో అంతర పంటగా మొక్కజొన్న సాగు

రెండు పంటలతో గిరిజన రైతులకు లాభాలు


పిప్పళ్ల సాగులో అంతర పంటగా మొక్కజొన్న

పెదబయలు: జిల్లాలో వేరుశనగ సాగు విస్తారంగా జరుగుతోంది. పంట చేతికందిన సమయం నుంచే మంచి మద్దతు ధర ఉండడంతో రైతులు సాగుపై ఆసక్తి చూపిస్తున్నారు. అలాగే వేరుశనగ సాగులో అంతర్ పంట మొక్కజొన్న(స్వీట్ కార్న్) సాగు చేస్తున్నారు.అంతర పంటలతో మంచి ఆదాయం లభిస్తుందని గిరిజన రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఏటా పండించిన వేరుశనగ వారపు సంతల్లో గిట్టుబాటు రావడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అలాగే పసుపు సాగులో కూడ అంతర పంటగ మొక్కజొన్న సాగు చేస్తున్నారు.ఎక్కువ పోషక విలువులు కలిగిన ఈ సాగు మండలంలోని సీతగుంట, అరడకోట,అడుగులపుట్టు, గంపరాయి, గలగండ, పెదకోడాపల్లి, లక్ష్మీపేట, వనభంగి, పర్రెడ, జామిగుడ పంచాయతీలో సాగు ఎక్కువగా చేస్తున్నారు. వేరుశనగ 50 కిలోల బస్తా మొదటి రకం రూ.1700 నుంచి రూ.2500 ధర పలుకుతుంది. దీంతో రైతులు ఈ పంటపై ఎక్కువ దృష్టి పెడుతున్నారు. ఈ ఏడాది 650 హెక్టార్లలో సాగు చేశారు. రైతులు అధికంగా ఏ పంటకు లాభాలు వస్తే అదే పంటకు ఆసక్తి కనబరుస్తున్నారు.అయితే గిరిజన ప్రాంతంలో సాగుకు ఎలాంటి ఎరువులు వేయకుండా సేంద్రియ పద్ధతుల్లో సాగు చేయడంతో ఇక్కడ వేరుశనగకు మంచి గిరాకీ, మద్దతు ధరతో వారపు సంతల్లో మైదాన ప్రాంత వ్యాపారులు వచ్చి కొనుగోలు చేస్తున్నారు. వేరుశనగల సాగుకు అంతర పంటలుగా మొక్కజొన్న(స్వీట్‌కార్న్) సాగు చేస్తున్నారు. మన్యంలో పండించే స్వీట్‌కార్న్‌కు మైదాన ప్రాంతాల్లో మంచి డిమాండ్ ఉందని, రైతులు చెబుతున్నారు. ఆశాజనకంగా ధరలు ఉంటున్నాయంటున్నారు. వేరుశనగతో పాటుగా మొక్కజొన్న కూడా ఆదాయం లభిస్తోందని, స్వీట్‌కార్న్ మంచి దిగుబడి వస్తుందని రైతులు చెబుతున్నారు. అయితే వేరుశనగ , పిప్పళ్లలో సాగులో పలుచగా మొక్కజొన్న వేస్తున్నామని తెలిపారు.

దిగుబడి బాగుంది

వేరుశనగ సాగు గత కొన్నేళ్లుగా చేస్తున్నాం. అయితే ఇదే సాగులో అంతర పంటగ వేరుశెనగ సాగు ఎంతో లాభదాయకంగా ఉంటుంది. రెండు పంటలకు మంచి గిరాకీ ఉంది. ఈ ఏడాది వేసవిలోనే వర్షాలు కురువడం వల్ల మంచి దిగుబడి వస్తుంది. అయితే ఇక్కడ ఎలాంటి క్రిమిసంహారక మందులు వాడకుండా సేంద్రియ ఎరువు మాత్రమే వాడడం జరుగుతుంది. పంటకు మంచి గిరాకీ ఉంది. అయితే వ్యవసాయ అధికారులు సలహాలు సూచనలు అందించాలి.

– రూడ లక్ష్మణరావు, రైతు, పెదబయలు

ఎక్కువ ఆదాయం



మండలంలో వేరుశనగ సాగు తక్కువ పంచాయతీల్లోనే సాగు చేస్తున్నారు. తక్కువ కాలంలో ఎక్కువ లాభం వస్తుంది. అలాగే వేరుశెనగ, పసువు పంటల్లో అంతర పంటల సాగుకు రైతులు అధిక ప్రాధాన్యతనిస్తున్నారు. తక్కువ కాలంలో లాభదాయక పంటల్లో వేరుశనగ పంట ఒకటి. ఇక్కడ వాతావరణం పంటకు అనుకూలంగా ఉండడం, మార్కెట్‌లో మంచి ధర ఉండడంతో రైతులు ఆసక్తి చూపిస్తున్నారు.ఏడాదికి రెండుసార్లు వేరుశనగ పంట తీస్తున్నారు. అలాగే రైతులకు సాగుపై అవగాహన కల్పించడం జరుగుతుంది. విత్తనశుద్ధి, సేంద్రియ ఎరువులు వాడకం, కలుపు నివారణ పద్ధతులపై అవగాహన కల్పిస్తున్నాం. మండలంలో ఎక్కువగా సీతగుంట, అరడకోట, గలగండ, గంపరాయి పంచాయతీల్లో ఎక్కువ సాగు చేస్తున్నారు.

– ఎ.శ్రీనివాస్, ఏవో, పెదబయలు

క్షతగాత్రుడికి అరకు ఎమ్మెల్యే పరామర్శ


క్షతగాత్రుడి ఎక్స్‌రేను పరిశీలిస్తున్న అరకు ఎమ్మెల్యే మత్స్యలింగం

అరకులోయటౌన్: ఆటో ప్రమాదంలో గాయపడి అరకులోయ ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పాంగి సంజీవ్(25)కు అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం ఏరియా ఆస్పత్రికి వెళ్లి పరామర్శించారు. మండలంలోని సుంకరమెట్ట పంచాయతీ జడ్డివలస గ్రామానికి చెందిన సంజీవ్ స్నేహితులతో కలిసి కటిక జలపాతం అందాలు వీక్షించడానికి ఆటోలో వెళ్తుండగా దురదృష్టవశాత్తు ఆటో బోల్తా పడింది. ఈ సంఘటనలో సంజీవ్‌కు కాళ్లు విరిగింది. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సంజీవ్‌కు మెరుగైన వైద్యసేవలందించాలని వైద్యులకు సూచించారు. ఎమ్మెల్యే వెంట ఉమ్మడి విశాఖ జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షుడు కమిడి అశోక్, మండల పార్టీ అధ్యక్షుడు స్వాభి రామ్మూర్తి, నియోజకవర్గ బూత్ కమిటీ ఇన్‌చార్జి పాంగి విజయ్, నాయకులు బోయి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

అనాథ పిల్లలకు పుస్తకాల వితరణ


అనాథ పిల్లలకు పుస్తకాలు, దుస్తులు పంపిణీ చేస్తున్న సురేంద్ర, చలపతి తదితరులు

డుంబ్రిగుడ: మండలంలోని అరకు పంచాయతీ కేంద్రంలోని యూనిట్ ఫర్ చారిటీ ట్రస్టు ఆధ్వర్యంలో అనాథ పిల్లలకు యూనిఫారంతో పాటు బ్యాగులు, పుస్తకాల పంపిణీ జరిగింది. పంచాయతీ కేంద్రంలో శనివారం జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ శారద, అరకులోయ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ చలపతిరావు, గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేంద్ర, న్యాయవాది సింహాచలం, ట్రస్టు ప్రతినిధి నీలి నారాయణరావు చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఆదివాసీ అనాథ పిల్లలను దత్తత తీసుకుని ఏటా వారి చదువులకు ఆసరగా నిలుస్తున్న యూనిట్ ఫర్ చారిటీ ట్రస్టు సేవలను పలువురు కొనియడారు. మాజీ సర్పంచ్ సురేష్‌కుమార్, ట్రస్టు సభ్యురాలు జోషి పిస్ తదితరులు పాల్గొన్నారు.

150 మందికి అందని తల్లికి వందనం


ఎంపీడీవో యాదగిరీశ్వరరావు

రాజవొమ్మంగి: మండలం కేంద్రంలోని రెండు సచివాయాల పరిధిలో 150 మందికి తల్లికి వందనం జమకాలేనట్టు ఎంపీడీవో యాదగిరీశ్వరరావు తెలిపారు. మొత్తం 1,091 మందికి గాను తొలి జాబితాలో 938 మందికి సొమ్ములు వారి వారి బ్యాంకు ఖాతాల్లో జమ అయినట్టు తెలిపారు. అర్హులకు మరోసారి దగ్గరలోని సచివాలయంలో అన్ని సర్టిఫికేట్లు అందజేయాలని కోరారు. పరిశీలించిన తరువాత జూలై 5న అర్హుల రెండో జాబితా ప్రకటించడం జరుగుతుందన్నారు. కాగా ఇప్పటికే అర్హులైన తల్లికి వందనం అర్హుల జాబితా సచివాలయం నోటీసు బోర్డులో ప్రదర్శనలో పెట్టామన్నారు.

గంజాయికి దూరంగా ఉండండి


ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు, గ్రామస్తులు

గొలుగొండ : ప్రతి ఒక్కరూ సన్మార్గంలో నడచి సమాజానికి, కుటుంబానికి మంచి పేరు తీసుకురావాలని నర్సీపట్నం రూరల్ సీఐ రేవతమ్మ, కృష్ణదేవిపేట, గొలుగొండ ఎస్ఐలు తారకేశ్వర్రావు, రామారావు హితవు పలికారు. పల్లావూరు నుంచి పాత కృష్ణదేవిపేట వరకు శనివారం నషాముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ రేవతమ్మ మాట్లాడుతూ గంజాయి వల్ల అనేక అనర్థాలు వస్తున్నాయన్నారు. గంజాయి రవాణా, అమ్మకాలు చేస్తున్న వ్యక్తులను అరెస్టు చేయడం వల్ల వారి కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. గంజాయి కేసుల్లో ఉన్న వారి ఆస్తులు సైతం కోర్టులు జప్తు చేస్తున్నట్టు చెప్పారు. అందువల్ల ప్రతి ఒక్కరూ గంజాయి, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు.

కొత్తకోట వారపు సంత మార్పు


మార్కెట్‌యార్డ్‌లో నిర్వహిస్తున్న వారపు సంత

రావికమతం : ట్రాఫిక్‌కు ఇబ్బందుల కారణంగా కొత్తకోటలో శనివారం జరిగే వారపుసంతను సాయిబాబా ఆలయం వెనుక ఉన్న మార్కెట్ యార్డ్‌లోకి మార్చామని సర్పంచ్ లోవరాజు, వైస్ సర్పంచ్ దేవా, పంచాయతీ ఈవో జ్యోతి రెడ్డి, డీసీఎంఎస్ మాజీ డైరెక్టర్ గుమ్మడు సత్యదేవ తెలిపారు. శనివారం ఇక్కడ జరిగే వారపు సంతకు చుట్టుపక్కల గ్రామాలైన చీమలపాడు పంచాయతీ శివారు గిరిజన గ్రామాల ప్రజలు, కన్నంపేట, వమ్మవరం గ్రామాల నుంచి వచ్చి వారానికి సరిపడా సరుకులు, కూరగాయల కొనుగోలు చేస్తారు. దీంతో ఇక్కడ ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతుంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో స్థానిక నాయకులు, జెడ్పీటీసీ సభ్యులు రమణమ్మ ఆదిమూర్తి, డీసీఎంఎస్ మాజీ డైరెక్టర్ సత్యదేవా, సర్పంచ్ లోవరాజు, వైస్ సర్పంచ్ దేవా, ఎంపీటీసీ సభ్యుడు గున్నాజీ తదితరులు నాబార్డు నిధులు రూ.17 లక్షలతో మార్కెట్ యార్డ్ నిర్మించారు. యార్డ్‌లో మంచినీటి సదుపాయం, మరుగుదొడ్లు ఏర్పాటు చేశారు. సంతను గతంలో మార్కెట్ యార్డ్‌కు తరలించారు.. కానీ వ్యాపారులు బీఎన్ రోడ్డుపైనే వ్యాపార లావాదేవీలు చేస్తుండడంతో ట్రాఫిక్ ఇబ్బందులు తప్పలేదు. ఈ నేపథ్యంలో నాయకులు, పోలీసులు, పంచాయతీ సిబ్బంది కలిసి శనివారం వారపు సంతను మార్కెట్ యార్డుకు తరలించారు.

విధుల్లో చేరిన ఉపాధ్యాయులు

కె.కోటపాడు : ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో భాగంగా ఎ.కోడూరు హైస్కూల్‌కు బదిలీ అయిన ముగ్గురు ఉపాధ్యాయులు శనివారం విధుల్లో చేరారు. హెచ్ఎం శేఖర్‌కు వీరు జాయినింగ్ రిపోర్టులను అందించారు. పాఠశాలలో చేరిన వారిలో పీడీ-1గా నాతవరం మండలం డి.యర్రవరం పాఠశాల నుంచి చిట్టి ప్రసాద్, పీడీ-2గా దేవరాపల్లి మండలం వేచలం నుంచి తమ్మునాయుడు, హిందీ ఉపాధ్యాయునిగా దేవరాపల్లి మండలం రైవాడ నుంచి చంద్రకళ వచ్చారు. కార్యక్రమంలో పీఎంసీ కమిటీ చైర్మన్ కిల్లి సింహాచలంనాయుడు, ఉపాధ్యాయులు ప్రసాద్, బంగారునాయుడు పాల్గొన్నారు.

ఘనంగా అభయాంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవం


అభయాంజనేయ స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

మునగపాక: మండలంలోని గణపర్తిలో అభయాంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. స్వామివారి విగ్రహ ప్రతిష్ట చేసి 33 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఉదయం నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలి వచ్చి దర్శించుకున్నారు.

మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో అన్నసమారాధన ఏర్పాటు చేశారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్ పూజ లు చేశారు. సమరసత ఫౌండేషన్ ప్రతినిధి గిన్నె వీర మహేశ్వరరావు, సర్పంచ్ చదరం నాయు డు, పిన్నమరాజు రవీంద్ర రాజు, రామ నాగేశ్వర రావు, కొండారావు, యల్లపు అప్పారావు, భీంపల్లి శ్రీనివాసరావు, పొనమళ్ల శ్రీను, చదరం జగదీష్, పెంటకోట నాయుడు తదితరులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం


సుజనపేటలో యోగా చేస్తున్న సర్పంచ్ రమేష్, వైద్య సిబ్బంది, గ్రామస్తులు


కొండగోకిరిలో ఉపాధి కూలీలతో యోగా చేయిస్తున్న ఎంపీడీవో ప్రసాద్

ముంచంగిపుట్టు: యోగాసనాలతో సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని సర్పంచ్ వెంగడ రమేష్ అన్నారు. మండలంలో గల సుజనకోట పంచాయతీ సుజనపేట గ్రామంలో యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా స్థానిక నేతలు, వైద్య సిబ్బంది, గ్రామ గిరిజనులు యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ రమేష్ మాట్లాడుతూ మానసిక ప్రశాంతత, పని ఒత్తిడిని జయించేందుకు యోగా సాధన ఉంతో ఉపయోగపడుతుందన్నారు.యోగా చేయడం ద్వారా అనేక వ్యాధులు దూరమవుతాయని, ప్రతి ఒక్కరూ యోగాను జీవితంలో భాగంగా చేసుకోవాలన్నారు. పంచాయతీ కార్యదర్శి సోమేష్, ఏఎన్ఎం సుశీల, ఆశ కార్యకర్త సుందరమ్మ ,గ్రామ గిరిజనులు పాల్గొన్నారు.

కొయ్యూరు: మండలంలోని కొండగోకిరిలో ఎంపీడీవో ఎస్.డి.వి.ప్రసాద్ ఆధ్వర్యంలో యోగాంధ్ర కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగా వల్ల కలిగే లాభాలను వివరించారు. ఉపాధి పనులు చేస్తున్న కూలీల నుంచి అంగన్‌వాడీ సిబ్బంది వరకు దీనిలో పాల్గొవాలని ఆయన కోరారు. అన్ని సచివాలయాల్లో యోగాంధ్రను నిర్వహించామన్నారు. ఈ నెల 17 నుంచి గ్రామాల్లో వివిధ అంశాలపై సర్వే చేపడతామన్నారు. ఎంపీడీవోల ఆధ్వర్యంలో కమిటీలను దీనిపై గ్రామసభలను నిర్వహిస్తాయన్నారు


రాజుపేటలోద్ది ఎంపీపీ పాఠశాలలో యోగాసనాలు వేస్తున్న చిన్నారులు

గంగవరం : మండలంలోని అనేక పాఠశాలల్లో యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఉపాధ్యాయులు, విద్యార్థులకు యోగాసనాలు ప్రదర్శించారు మండలంలోని గల మండల పరిషత్ ప్రాథమిక, ప్రాథమికోన్నత , గిరిజన ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శనివారం విద్యార్థులు ప్రదర్శించిన యోగాసనాలు ఆకట్టుకున్నాయి. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పిడుగుపాటుకు రెండు పాడి ఆవులు మృతి


మృతి చెందిన పాడి ఆవుల వద్ద గ్రామస్తులు

చీడికాడ: మాడుగుల నుంచి ఖండివరం రహదారిలో మోసూరి వారి కళ్లాలు వద్ద గల జనపరెడ్డి కళ్యాణంకు చెందిన పాడి ఆవులు పిడుగుపాటుకు మృతి చెందాయి. చీడికాడ మండలం ఖండివరం గ్రామానికి చెందిన కళ్యాణం పశువులను మేతకు వదలగా శనివారం మధ్యాహ్నం ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం పడి రెండు పాడి ఆవులు పిడుగుపాటుకు గురై అక్కడికక్కడే మృత్యువాత పడ్డాయి. బాధిత రైతుకు ఈ పాడి ఆవులే ఆధారం. వీటి ఖరీదు సుమారు రూ.రెండు లక్షలు ఉంటుందని తెలిపారు. బాధిత రైతును చోడవరం సీడీసీ చైర్మన్, జిల్లా వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి సుంకర శ్రీనివాసరావు, స్థానిక ఎంపీటీసీ సభ్యులు గెంజి స్వాతి, బాలాజీ, చీడికాడ మండల కోఆప్షన్ సభ్యుడు షేక్ సూర్యనారాయణ, మాజీ పీఏసీఎస్ అధ్యక్షుడు మోసూరి సన్నిబాబు పరామర్శించారు. ప్రభుత్వం బాధిత రైతును ఆదుకోవాలని కోరారు.

లారీ ఢీకొని గేదెలు మృతి

జాతీయ రహదారిని దిగ్బంధించిన గ్రామస్తులు


మరణించిన గేదెలు


జాతీయ రహదారిపై నిలిచిన లారీలు

కొయ్యూరు: జాతీయ రహదారి నిర్మాణానికి మెటీరియల్ తరలిస్తున్న లారీలు కాట్రగెడ్డ సమీపంలో శనివారం సాయంత్రం రెండు గేదెలను ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆయా గేదెలు అక్కడే మృతి చెందాయి. ఒక్కో గేదె విలువ లక్ష రూపాయలు ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. డ్రైవర్ల నిర్లక్ష్యం వల్ల ఈ ప్రమాదం జరిగినట్టు తెలిపారు. దీనిపై ఆగ్రహం చెందిన నడింపాలెం, కాట్రగెడ్డ గ్రామస్తులు జాతీయ రహదారిని గంటన్నర సేపు దిగ్బంధించారు. రెండు వైపులా నుంచి వస్తున్న వాహనాలను నిలిపివేశారు. ఈ ప్రమాదంలో నడింపాలెంకు చెందిన వెలుసూరి రామారావుకు చెందిన గేదెలు రెండు మరణించడంతో ఆయన కన్నీటి పర్యంతమయ్యారు. గేదెల మృతితో జీవనాధారం కోల్పోయానని వాపోతున్నారు. బాధితుడు రామారావుకు ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

పార్టీ బలోపేతానికి కృషి


సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షురాలు మఠం శాంతకుమారి

ముంచంగిపుట్టు: మండల కేంద్రంలోని బీజేపీ జిల్లా అధ్యక్షురాలు మఠం శాంతకుమారి శనివారం పర్యటించారు. నేతలు, కార్యకర్తలతో మండల స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం పథకాలు గ్రామస్థాయిలో ప్రజలకు వివరించాలన్నారు. నాయకులు సుబ్బరావు, మత్స్యరాజు, సత్యవతి, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.




ఉదయం మంచు.. మధ్యాహ్నం వర్షం

ప్రముఖ పర్యాటక కేంద్రమైన అరకులోయలో శనివారం భిన్న వాతావరణం ఏర్పడింది. ఉదయం 9 గంటల వరకు విపరీతమైన మంచు కురిసింది. దీంతో వ్యవసాయ పనులకు వెళ్లే గిరిరైతులు ఇబ్బంది పడ్డారు. వాహనచోదకులు హెడ్‌లైట్లు వేసుకొని ప్రయాణాలు సాగించారు. అనంతరం మధ్యాహ్నం 12 గంటల నుంచి వర్షం కురిసింది. ఇటీవల ఎండలతో ఇబ్బంది పడ్డ స్థానికులకు ఒక్కసారిగా వాతావరణం చల్లబడడంతో సేదదీరారు.

– అరకులోయటౌన్